క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ములుగు జిల్లా మహ్మద్‌గౌస్‌పల్లికి చెందిన గొట్టిముక్కుల సుశీల,అశోక్ దంపతులు వరంగల్ నుంచి మహ్మద్‌గౌస్‌పల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆత్మకూరు శివారులో కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ ప్రణాళికను రూపొందించాలి

న్యూశాయంపేట: రాష్ట్ర ప్రభుత్వం పక్కా వ్యవసాయ ప్రణాళికను రూపొందించాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చుక్కయ్య మాట్లాడారు. గత ప్రభుత్వం 2021వ నాటికి వ్యవసాయ ప్రణాళికను ఆపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇప్పటి ప్రభుత్వం ఏకకాలంతో రుణమాఫీ చేయాలని కోరారు. వచ్చేనెల 6న హనుమకొండ సుందరయ్య భవన్‌లో రైతాంగ సమస్యలపై సమావేశంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు బండి పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన మునిగాల వెంకటేశ్వర్లు (48) కాజీపేట మండలం తరాలపల్లి గ్రామంలోని ఓ క్వారీలో పని చేస్తున్నాడు. ఈ నెల 27న రోజు మాదిరిగానే పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్త ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై రాజబాబు తెలిపారు. మృతుడి భార్య మునిగాల రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

వరంగల్: పోగొట్టుకున్న ఫోన్లను నూతన సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్) సహకారంతో పోలీసులు వెతికి పట్టుకుని బాధితులకు అప్పగిస్తున్నారు. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల స్టేషన్ పరిధిలో పలువురు వ్యక్తులు సెల్‌ఫోన్లు పోగొట్టుకుని తమకు ఫిర్యాదు చేశారని, దాంతో కేసు నమోదు చేసిన తమ సిబ్బంది ఏనుమాముల టెక్నికల్ టీమ్ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్లను వెతికి పట్టుకున్నట్లు తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌తో కలిసి బాధితులను పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం పిలిపించి ఫోన్లను అందజేసినట్లు వివరించారు. చాకచక్యంగా విధులు నిర్వహించిన కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌ను సీఐ అభినందించారు.

పొంచి ఉన్న ప్రమాదం


చెట్ల మధ్యనుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


రోడ్డు మధ్యలో ఉన్న స్తంభం


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- అడ్డంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- చెట్ల మధ్య నుంచి విద్యుత్ తీగలు
- స్తంభాలు తొలగించాలని వేడుకోలు

శాయంపేట : బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మాందారిపేట గ్రామం నుంచి ప్రగతి సింగారం గ్రామం వరకు జాతీయ గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు నిర్మాణంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించకుండానే సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. దీంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు కొన్ని స్తంభాలు తొలగించి మిగితా వాటిని అలాగే వదిలివేశారు.

చెట్ల మధ్య నుంచి విద్యుత్ తీగలు

బీసీ కాలనీలో చెట్ల మధ్యలో నుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. దీంతో వర్షం కురిస్తే కరెంట్‌షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. స్థానిక బీసీ హాస్టల్‌కు వెళ్లే దారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభంతో ఉండడంతో కాలనీవాసులు, రైతులకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా శాయంపేట నుంచి కొత్తగట్టు సింగారం వెళ్లే బైపాస్ రోడ్డు మలుపులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు ఏర్పాటు చేయకుండా అక్కడే ఉంచి రోడ్డు వేయడంతో మూడు నెలల క్రితం ద్విచక్రవాహనం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఫెన్సింగ్ తాకి వాహనదారులు గాయపడ్డారు. సోషల్ వెల్ఫేర్ పాఠశాల ఎదురుగా శాయంపేట సెంటర్‌లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రభుత్వ బాలుర పాఠశాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన కంచె సైతం రోడ్డును ఆక్రమించింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన కంచెను సరిచేసి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు మధ్య స్తంభాలు తొలగించాలి



బీసీ కాలనీలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉంది. చెట్ల మధ్యలో ప్రమాదకంగా విద్యుత్ తీగలు ఉండడంతో వర్షం వచ్చినప్పుడు కరెంట్ షాక్ గురయ్యే అవకాశాలు ఉన్నాయి. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

\- చింతల భాస్కర్

ప్రమాదకర స్తంభాలను తొలగిస్తాం..

ప్రమాదకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను కొన్ని తొలగించాం. మరికొన్ని స్తంభాలను తొలగిస్తాం. వినియోగదారులకు, గ్రామస్తులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం. నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందకు తమ వంతు కృషి చేస్తాం.

\- రాజ్‌కుమార్, ఏఈ

అట్రాసిటి కేసుపై ఏసీపీ విచారణ


విచారణ చేస్తున్న ఏసీపీ తిరుపతి, ఎస్సై అనిల్ కుమార్

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై ఈ నెల 23వ తేదీన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. కాగా ఈకేసు విషయంపై మంగళవారం ఏసీపీ తిరుపతి పంథినిలో విచారణ చేపట్టారు. ఎస్సై గైకడి అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గిర్మాజిపేట ప్రాంతానికి చెందిన బుట్టి రంజిత్ పంథిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలం లీజుకు తీసుకున్నాడు. కాగా సదరు భూయజమాని కొంత ఇన్వెస్ట్‌మెంట్ పెట్టి పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువుగా స్థలాన్ని మార్పులు చేశాడు. అయితే లీజు దారు ఆభూమి పరిశీలనకు వచ్చిన సందర్భంలో హైటెన్షన్ వైర్‌లు పై నుంచి పోవడాన్ని గమనించాడు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువు కాదని లీజ్ రిజక్ట్ చేశాడు. అప్పటికే కొంత మొత్తాన్ని ఖర్చు చేసి భూమిని చదును చేయించిన భూ యజమాని తనకు ఖర్చు అయిన మొత్తంతో పాటు లీజు అగ్రిమెంట్ రిజక్ట్ చేసినందుకు జరిమానా ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై భూ యజమాని లీజుదారు ఇంటికి వెళ్లి అడగడంతో కులం పేరుతో దూషించాడని బుట్టి రంజిత్ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పంథిని గ్రామస్తుడిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

మొరం తరలింపు అడ్డగింత


పొక్లెయినర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తులు

నడికూడ : మండల కేంద్రంలోని పెద్చెరువు నుంచి అక్రమంగా మొరం తరలించేందుకు ప్రయత్నించిన వారిని గ్రామస్తులు అడ్డుకున్నారు. పొక్లెయినర్, టిప్పర్లను తిరిగి వెనక్కి పంపారు. ఈ సందర్భంగా స్థానికులు విలేకరులతో మాట్లాడుతూ.. మైనింగ్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఇష్టం వచ్చినట్లు అనుమతి ఇవ్వడంతో లక్షల రూపాయల విలువైన మొరం తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధుల స్వార్ధ ప్రయోజనాల కోసం అక్రమంగా మొరం తరలిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇదే విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించాలని వారు కోరారు. అయితే పొక్లెయినర్, టిప్పర్లు పరకాల మాజీ ఎమ్మెల్యేకు చెందినవి అని గ్రామస్తులు పేర్కొన్నారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

- రెడ్‌క్రాస్ మెడికేర్ యూనిట్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్


సీఐకి వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్

కమలాపూర్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను వయో వృద్ధులు వినియోగించుకోవాలని హనుమకొండ రెడ్‌క్రాస్ మొబైల్ మెడికేర్ యూనిట్ ఉపాధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. కమలాపూర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ రెడ్ క్రాస్ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో వయో వృద్ధులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 106 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వెంకటనారాయణగౌడ్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ సహకారంతో తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్, సీనియర్ సిటిజన్స్ సహకారంతో 60 ఏళ్లు దాటిన వయో వృద్ధులకు ప్రతి నెల వారి ఇళ్ల వద్దకే వచ్చి ఉచితంగా వైద్యసేవలు అందిస్తూ మందులు పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలసాని రమేష్‌గౌడ్, సీఐ హరికృష్ణ, ఎంపీడీఓ గుండె బాబు, రెడ్ క్రాస్ సొసైటీ వైద్యులు జె.కిషన్‌రావు, డాక్టర్ మహమ్మద్ తహర్ మసూద్, సిబ్బంది గుల్లేపల్లి శివకుమార్, అరువ గంగాధర్, అనిల్, జక్కోజు నరసింహాచారి, రాజు, నాయకులు పెరుమాండ్ల పర్శరాములు, జనగాని శివకృష్ణ, భిక్షపతి, నూక సంపత్‌కుమార్, వయోవృద్ధులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి లక్ష పుష్పార్చన




అమ్మవారికి లక్ష పుష్పార్చన చేస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం వైశాఖమాసం బహుళ పంచమి తిథి రాజరాజేశ్వరి దేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి లక్ష పుష్పార్చనను శోభాయమానంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం 108 కలశాలతో 53 రకాల సుగంధ ద్రవ్యాలతో 135లీటర్ల ఆవుపాలతో అమ్మవారికి విశేష అభిషేకం జరిపించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేస్తుండగా తొమ్మిది రకాల పుష్పాలతో పుష్పార్చన చేశారు. అనంతర అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం పూల ఉంజలి, త్రిశతి నామాలతో దీపాలంకరణ చేశారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వర్సిటీ అభివృద్ధి అందరి బాధ్యత



కేయూ క్యాంపస్: గత మూడేళ్లలో కాకతీయ యూనివర్సిటీలో అకడమిక్ పాలన మందగించిందని, ఈక్రమంలో వర్సిటీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి సూచించారు. యూనివర్సిటీలో నిరంకుశ తరహా పాలన ముగిసిందని, అకడమిక్ పరంగా గత మూడేళ్లలో నష్టపోయిన అధ్యాపకులందరికి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు అకుట్ ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి, కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రమేష్‌తో కలిసి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డిని మంగళవారం కలిసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ బాటనీ విభాగంలో రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ విభాగం అధిపతిగా కాంట్రాక్టు లెక్చరర్‌కు బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆ విభాగేతర అధ్యాపకుడిని బీఓఎస్ చైర్మన్‌గా నియమించారన్నారు. ఇంగ్లిష్ విభాగంలో బీఓఎస్‌ను ఆ విభాగం అధ్యాపకులనే నియమించాలని చెప్పారు. గణితశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భారవీశర్మను నియమించాలని, ఫిజికల్ విభాగంలో రొటేషన్ పద్ధతిలో విభాగం అధిపతిని నియమించాలన్నారు. అధ్యాపకుల బదిలీలకు విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

కపిలవాయి స్మారక అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న కృష్ణమాచార్యులు

హన్మకొండ కల్చరల్: ప్రసిద్ధ కవి రచయిత డాక్టర్ కపిలవాయి లింగమూర్తి స్మారక అవార్డును నగరానికి చెందిన విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ధర్మపీఠం సంచాలకుడు, కవి, రచయిత చొల్లేటి కృష్ణమాచార్యులు అందుకున్నారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనందాచారి, ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, రచయిత్రి దాసోజు లలిత, కపిలవాయి లింగమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొని కృష్ణమాచార్యులను సన్మానించి అవార్డు ప్రదానం చేశారు. గతంలో కృష్ణమాచార్యులు సాహిత్య రత్న, సేవారత్న వంటి పురస్కారాలు అందుకున్నారు. నీరాజనం, తెలంగాణ అమరవీరుల స్వర్ణాక్షర నివాళి, విశ్వకర్మ పురాణం, ఉపనిషత్తుల సంకలనం, ఆచార్య నాగార్జున విశ్వబ్రహ్మ చరిత్ర వంటి చారిత్రాత్మక నవల రచించినందుకు అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విశ్వనాథుల పుష్పగిరి, తెలంగాణ తల్లి విగ్రహ రూపశిల్పి డాక్టర్ బైరోజు వెంకటరమణ పాల్గొన్నారు.

'సఖి' సేవలపై అవగాహన

విద్యారణ్యపురి: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో బాధిత మహిళలు, బాలికలకు ఐదు రకాల సేవలను అందిస్తున్నట్లు సఖి సెంటర్ కేస్ వర్కర్ హరిత తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌రోడ్డు ప్రాంతంలోని హనుమకొండ వసుంధర గరల్స్ హాస్టల్‌లో ఇన్‌చార్జ్ లావణ్య ఆధ్వర్యంలో సఖి సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు అంశాలను వారికి హరిత వివరించారు. సఖి సెంటర్ ఉద్దేశాలు, సేవల గురించి తెలియజేశారు. బాధితులకు వైద్య సహాయం, కౌన్సిలింగ్, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి లాంటి సేవలు గురించి వివరించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


కమలాపూర్ : నృత్యాలు చేస్తున్న భక్తులు


ఆత్మకూరు: కామారంలో మాలధారులు..


వేలేరు: అన్నదానం చేస్తున్న ఎంపీటీసీ దంపతులు

ఆత్మకూరు : మండలంలోని కామారం గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర మంగళవారం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ స్వాములకు భక్తులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హనుమాన్ సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో కందుకూరి నరేష్, లక్కర్సు కుమారస్వామి, కంది సుమన్‌రెడ్డి, గోల్కొండ రాజ్‌కుమార్, అట్ల రాజు, చెక్క రంజిత్, నరేష్, రాకేష్, వంశీ, అబ్బరబోయిన అనిల్, అజయ్, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వేలేరు : హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నామని వేలేరు ఎంపీటీసీ-1 ఇట్టబోయిన సంధ్యభూపతిరాజు దంపతులు అన్నారు. మంగళవారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదానం చేశారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : హనుమాన్ మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కమలాపూర్‌లో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై ఆంజనేయ స్వామిని ఊరేగిస్తూ స్థానిక పనగట్ల నుంచి ప్రారంభమైన శోభాయాత్ర బస్టాండ్ కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా మాలధారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ భక్తిపారవశ్యంతో జై హనుమాన్, జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ హనూమాన్ శోభాయాత్రలో పాల్గొన్నారు. శోభాయాత్ర సందర్భంగా పలువురు భక్తులు ఆంజనేయస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు.

నేడు సప్తశతి చండీ హోమం

దామెర : సప్తశతి చండీ హోమాన్ని నేడు(బుధవారం) నిర్వహించనున్నట్లు హనుమాన్ దేవాలయం చైర్మన్ పోలం కృపాకర్ రెడ్డి తెలిపారు. వైశాఖ వార్షికోత్సవం సందర్భంగా లోకకల్యాణార్థం హోమం నిర్వహిస్తున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు శాంతి మంత్రము, మహాగణాధిపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనము, రక్షాబంధనము, అభయాంజనేయ స్వామి (మన్యుసూక్త పూర్వకంగా) పంచామృతాల అభిషేకం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం పంచగ్రహ మండపస్థపన, బ్రహ్మాది మండప వేవతాస్థపన నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు లక్ష్మీగణపతి, సప్తశతి చండీ హోమం ఉంటుందని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు గుమ్మడివెల్లి సుబ్బరామయ్య, అనురాగ్ శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ చెప్పారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్


ఎల్కతుర్తి: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్


ఐనవోలు: మాట్లాడుతున్న ఏఓ కవిత

- ఎస్సై గోదారి రాజ్‌కుమార్

ఎల్కతుర్తి : రైతులకు ఫెర్టిలైజర్ డీలర్లు ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై గోదారి రాజ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏఓ రాజ్‌కుమార్ అధ్యక్షతన ఫెర్టిలైజర్, పెస్టిసైడ్ డీలర్లతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రైతులకు మేలైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలను, పురుగుల మందులు విక్రయించి వాటి వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. పంట దిగుబడికి నష్టం కలుగకుండా జాగ్రత్త చెప్పాలన్నారు. ఎవరైనా అధిక కమీషన్లకు కక్కుర్తి పడి రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించి వారిని నష్టపరిచే విధంగా వ్యవహరిస్తే సంబంధిత డీలర్లు, బ్రోకర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా పీడీ యాక్టు ప్రయోగించి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. అనంతరం ఏడీఏ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని డీలర్లు రైతులకు విక్రయించే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలు, కంపెనీ, రైతు వివరాలను తప్పనిసరిగా తమ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. అలాగే రైతులకు విక్రయించిన విత్తనాల రశీదును తప్పక ఇవ్వాలన్నారు.ఈ సదస్సులో ఏఈఓలు పంజాల రాజుగౌడ్, తిరుపతి, కళ్యాణి, రోజా, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.


ఐనవోలు: ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

నాణ్యమైన విత్తనాల కొనుగోలుపై అవగాహన

ఐనవోలు : మండలంలోని ఐనవోలు, పున్నేలు, వెంకటాపూర్, కొండపర్తి, వనమాల కనపర్తి, లింగమోరిగూడెం, ఉడుతగూడెం గ్రామాల్లో విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక రైతువేదికలో ఏఓ కవిత మాట్లాడుతూ అన్నదాతలు లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోను కొనుగోలు చేయరాదన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యేవరకు ఖాళీ విత్తన ప్యాకెట్, రశీదును తమవద్ద భద్రపరుచుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు విశ్వభాను, హీన కౌసర్, ఆఫ్రిన్, సువర్ణ ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దురిశెట్టి కుమారస్వామిపై వానరాల మంద దాడి చేయడంతో కింద పడగా తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. కాగా మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతుల ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుల ప్రవీణ్, సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి ఆదిరెడ్డిలు కుమారస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 2వేల ఆర్థికసాయం అందజేశారు. బండా నారాయణరెడ్డి, మందాడి రాజు, మొగిలి, తిరుపతి రెడ్డి, రమేష్, సాంబరాజు, రవీందర్, రమేష్, శివ, సాంబయ్య, రాజయ్య, చంద్రమౌళి ఉన్నారు.